క్లుప్తంగా

బంగారు తిరుచ్చిపై శ్రీవారి పట్టపురాణి



భక్తులను అనుగ్రహిస్తున్న పద్మావతి అమ్మవారు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం సర్వాలంకార భూషితురాలై బంగారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత వేకువజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారిని వజ్ర వైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తర్వాత శ్రీకృష్ణ ముఖమండపం వద్ద స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం పాంచరాత్ర ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం అలంకార మండపంలో ఉయ్యాలసేవలో అమ్మవారు సేదదీరారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన సదస్సు

తిరుపతి సిటీ: స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజీలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఫెమి-9 సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు హార్మోన్ల మార్పు, ఆరోగ్యకరమైన జీవనశైలి అనే అంశంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫెమి9 సంస్థ ప్రతినిధి అనంత్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్ర మాట్లాడారు. విద్యార్థినులు చదువుతో పాటు ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరచుకోవాలన్నారు. రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే హార్మోన్లు సమతుల్యంగా ఉంటాయన్నారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందకుమార్ రెడ్డి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ చంద్రకళ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

–శిక్షణలో డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు

తిరుపతి అర్బన్: పొదుపు సంఘాలను బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకుని గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు అన్నారు. శుక్రవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో పొదుపు సంఘాల లీడర్లు, సీసీలు, ఏపీఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామాలలోని అత్యంత నిరుపేదల అవసరాలు, మహిళల జీవనోపాధుల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీడీ ప్రభావతి, డీపీఎం తదితరులు పాల్గొన్నారు.


జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలి



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి

తిరుపతి సిటీ: స్థానిక గిరిజన భవన్‌లో ఇటీవలే నిర్వహించిన స్టేట్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో పతకాలు సాధించిన పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులను శుక్రవారం ఆ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ సి.భువనేశ్వరి ప్రత్యేకంగా అభినందించారు. బంగారు పతకాలు సాధించిన 17మంది విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీల్లోనూ సత్తా చాటి కాలేజీకి మరింత పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మెడిగోలో అరుదైన సర్జరీ



శస్త్ర చికిత్స అనంతరం కోలుకున్న రోగితో వైద్య బృందం

తిరుపతి తుడా: స్థానిక కరకంబాడి రోడ్డులోని మెడిగో ఆసుపత్రిలో అరుదైన, క్లిష్టమైన ప్లాస్టిక్ సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ సజిత్ తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఓ ప్రైవేట్ కంపెనీలో రోజువారీ కూలీగా పనిచేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు అతని చేతికి తీవ్రమైన గాయమై 85శాతం కంటే ఎక్కువ చేతి భాగంలో లోతైన చీలికతో రక్తనాళాలు పూర్తిగా తెగిపోయాయన్నారు. తమ హాస్పిటల్ వైద్య నిపుణుల బృందం అత్యాధునిక మైక్రోసర్జరీ పద్ధతులను ఉపయోగించి ప్లాస్టిక్ సర్జరీ విజయవంతంగా చేసిందని చెప్పారు.

మా ఇళ్ల వద్దకు వస్తే నిలదీస్తాం

- అబద్ధపు హామీలతో నమ్మించి మోసం
- ఏడాది దాటినా నెరవేర్చకుండా కహానీలు
- చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరించిన భూమన అభినయ్‌రెడ్డి



29వ డివిజన్‌లో చంద్రబాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరిస్తున్న భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : అబద్ధపు హామీలతో నమ్మించి దగా చేశారు..అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలు నెరవేర్చకుండా కహానీలు చెబుతున్నారు.. కూటమి నాయకులు 'తొలి అడుగు' కార్యక్రమం పేరిట తమ ఇళ్ల వద్దకు వస్తే నిలదీస్తామని తిరుపతి నగర వాసులు ప్రభుత్వ పాలనపై దుమ్మెత్తి పోశారు. ఎన్నికల్లో చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి 9, 19, 28, 29, 37వ డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి బాబు మేనిఫెస్టో మోసాలను ప్రజలకు వివరించినప్పుడు పైవిధంగా ప్రజలు స్పందించారు.

తాము అధికారంలోకి వస్తే జగన్‌మోహన్‌రెడ్డి కంటే రెండింతలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల్లో చంద్రబాబు ఊదరగొట్టి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, కూటమి నాయకులు ఇళ్ల వద్దకు వచ్చి వార్డులో సమస్యలుగానీ, ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగిన పాపానపోలేదని మండిపడ్డారు.

నమ్మితే నట్టేట ముంచేస్తాడంతే...

చంద్రబాబును నమ్మితే నట్టేటముంచేస్తాడని భూమన అభినయ్‌రెడ్డి ప్రజలకు చెప్పారు. నోటికొచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక నమ్మినవాళ్లను వంచించడం, మోసగించడం చంద్రబాబు నైజమన్నారు. రాజకీయాల్లో 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని తానకు తాను గొప్పలు చెప్పుకునే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడల్లా ఇచ్చిన హామీలను నెరవేర్చిన దాఖలాలు లేవని చరిత్ర చెప్పే సత్యమన్నారు. మామనే వెన్నుపోటు పొడిచిన ఆయనకు నమ్మి ఓట్లు వేసిన ప్రజలను వెన్నుపోటు పొడిచాడనడంలో ఆశ్చర్యమేముందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీల ప్రకారం ఏడాది కాలంలో ఒక్కో కుటుంబం రూ.లక్ష నుంచి రూ. 2.5లక్షల వరకు నష్టపోయిందని, ఏడాది కాలంలోనే ప్రజల్లో కూటమి ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, బసవ గీత, ఆదిలక్ష్మి, తాతయ్యగుంట గంగమ్మ ఆలయం మాజీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, పార్టీ నాయకులు ఊతుకుంట మోహన్, బాలాజి, కోదండ, మహ్మద్ ఖాసీమ్‌బాషా, సుబ్బు, రవిచంద్ర, చాంద్‌బాషా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగుతో మునగంగ..!

– తాగునీటి కోసం అవస్థలు పడుతున్న శెట్టిపల్లె



కల్వర్టు నిర్మాణం వద్ద దెబ్బతిన్న తెలుగుగంగ పైపులైనుపై పొంగి పొర్లుతున్న మురుగునీరు



మంగళం నుంచి రేణిగుంట మార్గంలో జరుగుతున్న కల్వర్టు నిర్మాణం వద్ద ఉన్న తెలుగు గంగ పైపులైన్ (ఫైల్)

తిరుపతి మంగళం : మంగళం ఆర్టీఓ కార్యాలయం ఎదురుగా రేణిగుంట మార్గంలోకి వెళ్లే ప్రధాన మార్గంలో టీటీడీ నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నారు. ఆ మార్గంలో కొన్ని రోజులుగా చేస్తున్న కల్వర్టు నిర్మాణం పనులతో తెలుగు గంగపైపు లైను కొంత దెబ్బతింది. దీంతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాలువలు పొంగి పొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో కల్వర్ట్ నిర్మాణం వద్ద దెబ్బతిన్న తెలుగుగంగ పైపుల్లోకి వరద ముంపుతో పొంగి పొర్లుతున్న మురుగునీరంతా చేరి కలుషితమవుతోంది. సమస్యను నివేదిస్తే పైపులైన్ బ్లాక్ చేశారు. అయితే నీళ్ల కోసం ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకపోవడంతో తాగునీటి కోసం శెట్టిపల్లెలోని 200 పైచిలుకు కుటుంబాలు అవస్థలు పడుతున్నాయి. ఇది కార్పొరేషన్ అధికారులకు తెలిసినా పైపులైన్లకు మరమ్మతులు చేసిన పాపానపోవడం లేదని మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యలపై క్రియాశీలక పోరాటం చేద్దాం

- విద్యార్థి, యువజన విభాగం నేతలతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని కలిసిన యువజన, విద్యార్థి విభాగం నాయకులు

తిరుపతి రూరల్: పల్లెల్లో యువతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులయ్యేలా చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విద్యార్థి విభాగం నాయకులకు ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మార్గదర్శనం చేశారు. శుక్రవారం తుమ్మలగుంటలోని ఆయన స్వగృహంలో ఇటీవల విద్యార్థి విభాగం, యువజన విభాగం నుంచి పదవులు పొందిన యువకులు మోహిత్‌రెడ్డిని, వైఎస్ఆర్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారి ద్దరూ యువ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పదవులను అలంకారప్రాయంగా కాకుండా బాధ్యతగా గుర్తెరిగి శ్రమించాలన్నారు. గ్రామాల్లో ప్రజా సమస్యలపై యువత క్రియాశీలకంగా పోరాటం చేసే దిశగా కార్యోన్ముఖులు కావాలన్నారు. జగనన్న ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడుతూ, అధికార పార్టీ అవినీతి అక్రమాలకు ప్రజల్లో ఎండగట్టాలని, ఎవరికి ఏ సమస్య వచ్చినా తాము వెన్నంటే ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి కె.భానుప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం సహాయ కార్యదర్శి శశిధర్‌రెడ్డి, యువ నేతలు ఈశ్వర్‌తేజ, మోహన్‌యాదవ్, సందీప్ చౌదరి, వినయ్‌చౌదరి, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐదవ రోజుకు చేరిన కార్మికుల సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

తిరుపతి తుడా: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరింది. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంజనీరింగ్ విభాగం కార్మికుల ధర్నా చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సీఐటీయూ నగర నేతలు టి.సుబ్రమణ్యం, వేణు గోపాల్ డిమాండ్ చేశారు. కార్మికులకు జీతాలు పెంచుతామని ఇచ్చిన హామీని అధికారంలోకి రాగానే కూటమి నేతలు విస్మరించారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు రూ. 26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో దాదాపు 600 మంది వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని,వీరికి ఎలాంటి గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు రామకృష్ణ, బుజ్జి, చిన్న, శ్రీరాములు, దాసు, వాసు, మురళి, శ్రీను, సత్య పాల్గొన్నారు.

డీఈఓ టీచరైన వేళ..!



పదో తరగతి విద్యార్థుల్లోని సామర్థ్యంను పరీక్షిస్తున్న డీఈఓ

చంద్రగిరి : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు డీఈఓ కెవిఎన్. కుమార్ పాఠాలు చెప్పారు. మండల పరిధిలోని తొండవాడ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులతో పాటు విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన సామగ్రిని, కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించారు.అనంతరం ఆయన 10వ తరగతి విద్యార్థులకు పాఠాలను బోధించి విద్యార్థుల్లోని సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో విద్యా బోధన నాణ్యతను పెంచాలని హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులకు డీఈఓ సూచించారు.

మహిళా వర్సిటీని సందర్శించిన తైవాన్ విద్యార్థులు



తైవాన్ వర్సిటీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్న మహిళా వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి రూరల్: తిరుపతిలోని శ్రీపద్మావతీ మహిళా విశ్వవిద్యాలయాన్ని నేషనల్ తైవాన్ యూనివర్సిటీ (ఎన్‌టీయూ) విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. హైదరాబాద్‌కు చెందిన ఇంపాక్ట్ హబ్‌తో మహిళా వర్సిటీకి ఉన్న అవగాహన ఒప్పందంలో భాగంగా మూడు నెలలు ఇంటర్న్‌షిప్ కోసం తైవాన్ వర్సిటీ నుంచి చుంగ్ చియా హుసువాన్, హువాంగ్ చెన్ కై, యుయి అకియామా వచ్చారు. వర్సిటీలోని వివిధ విభాగాల విద్యార్థినులతో జరిగిన ముఖాముఖిలో ఇక్కడి విద్యార్థినులు వారికి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విద్యావ్యవస్థల గురించి వివరించారు. నాలుగు రోజుల పాటు వీరు వర్సిటీలోని వివిధ విభాగాలు, ఇంక్యుబేషన్ సెంటర్లను సందర్శిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. అంతకు ముందు వీసీ ఉమ చేతుల మీదుగా విదేశీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.రజని, డీన్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ పి.విజయలక్ష్మి, అసోసియేట్ డీన్ ఆర్.ఉష పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న మోదీ ప్రభుత్వం

- రాష్ట్రాన్ని అప్పుల ప్రభుత్వంగా మార్చిన బాబు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ



ర్యాలీ చేస్తున్న సీపీఐ నేతలు, పార్టీ శ్రేణులు

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ చిచ్చుపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ విమర్శించారు. తిరుపతి నగర సీపీఐ మహాసభలో భాగంగా శుక్రవారం కాటన్ మిల్లు నుంచి ఆటోనగర్‌లోని క్రిష్టారెడ్డి స్థూపం వరకు కార్మికులు భారీ ర్యాలీ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, గత 11 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నా రైతులకు మేలు చేసిందేమీ లేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన హామీ ఊసే లేదన్నారు. ఇక, టీటీడీలో అన్యమతస్తులు ఉన్నారని, వారిని బయటకు పంపాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడడం విడ్డూరమన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం అని చెప్పి ఇప్పటికే రూ.1.70 లక్షల కోట్ల అప్పులతో డబుల్ అప్పుల ప్రభుత్వంగా చంద్రబాబు మార్చి, రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారని ధ్వజమెత్తారు. అమరావతి పేరుతో మళ్లీ రూ.31 వేల కోట్లు అప్పులు తెస్తున్నారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు హరినాథరెడ్డి మాట్లాడుతూ, డబ్బుల కోసం తిరుపతిలో కార్పొరేటర్లు సంతలో పశువుల్లా పార్టీలు మారారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర నేత పెంచలయ్య, సీపీఐ నేతలు రామానాయుడు, శివారెడ్డి, పి.మురళి, రాధాకృష్ణ, కత్తి రవి, విశ్వనాథ్, నదియా, ఎన్‌డీ.రవి, శివ, కేవై.రాజా, రామకృష్ణ, పద్మనాభరెడ్డి, బలరాం, చలపతి, మంజుల, రత్నమ్మ, ఏఐటీయూసీ నేత చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సాంకేతికతతో ముందుకు..

– రాష్ట్ర సాంకేతిక విద్యా విభాగం డైరెక్టర్



తనిఖీ చేస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్య విభాగం డైరెక్టర్ గణేష్‌కుమార్

తిరుపతి రూరల్: మండలంలో పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీని రాష్ట్ర సాంకేతిక విద్యా విభాగం డైరెక్టర్ గణేష్‌కుమార్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. కాలేజీలో ఉన్న ల్యాబొరేటరీలు, తరగతి గదులను పరిశీలించారు. అన్ని విభాగాధిపతుల ఫ్యాకల్టీ, ప్రిన్సిపాల్, విద్యార్థులతో మాట్లాడారు. ఐటీఐతో సాంకేతికతను అందిపుచ్చుకుని ఉద్యోగ అవకాశాల్లో ముందుండాలని, మంచి ఉద్యోగాలతో స్థిరపడాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఏపీఎస్ఎస్‌డీసీ స్కిల్ హబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. అక్కడ శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువకులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రఘు, ఎంప్లాయ్‌మెంట్ బ్యూరో డిప్యూటీ చీఫ్ శ్రీనివాసులు, తిరుపతి ఐటీఐ ప్రిన్సిపాల్ గణేష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎస్వీయూ అకడమిక్ కన్సల్టెంట్ల జాబితాపై తర్జనభర్జన

తిరుపతి సిటీ : ఎస్వీయూలో పెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో నిర్వహించిన ఇంటర్వ్యూలకు సంబంధించి తుది అర్హుల జాబితాను ప్రకటించడంలో వర్సిటీ అధికారులు తర్జన భర్జన పడుతున్నారు. ఈసీ సమావేశం నిర్వహించి ఆమోద ముద్ర వేసిన తర్వాతనే జాబితా ప్రకటించాలని ఓ అధికారి ఒత్తిడి చేస్తుండగా, జాబితా ప్రకటించిన తర్వాతా వీసీ సమావేశం ఏర్పాటు చేద్దామనే కోణంలో మరో అధికారి ఆలోచిస్తున్నట్లు సమాచారం. దీంతో సోమవారం ఎలాగైనా ఎంపికైన తాత్కాలిక అధ్యాపకుల జాబితాను ఖరారు చేసి ప్రకటించాలని కసరత్తు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా వచ్చే వారంలో అధ్యాపకులు భవితవ్యం తేలనుంది.

చంద్రగిరి ఎమ్మెల్యేకు మాతృ వియోగం

చిత్తూరు అర్బన్: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి మాతృ వియోగం కలిగింది. ఈయన తల్లి లక్ష్మీభారతి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. స్థానిక బీవీరెడ్డి కాలనీలో కొంతసేపు భౌతికకాయాన్ని ఉంచిన కుటుంబ సభ్యులు, ఆపై పాకా ల మండలం పులివర్తివారిపల్లెకు తరలించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నానిని చిత్తూరులో పలువురు రాజకీయ ప్రముఖులు, అధికారులు పరామర్శించారు.

ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు



ఆక్రమణదారులను హెచ్చరిస్తున్న రెవెన్యూ అధికారులు

తిరుపతి మంగళం : ప్రభుత్వ భూమి, కుంటలు, కాలువలు, చెరువుల్లో ఆక్రమణలకు పాల్పడితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అర్బన్ తహశీల్దార్ సురేష్‌బాబు హెచ్చరించారు. శుక్రవారం మంగళం సమీపాన తిరుమలనగర్ పంచాయతీ గంగాదేవి గిరిజన కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి గుడిసెలు వేసుకునేందుకు కొందరు చేసిన ప్రయత్నాన్ని రెవెన్యూ అధికారులు ప్రసాద్, సతీష్ అడ్డుకున్నారు. సర్వే నంబర్ 169/1లో ఉన్న 4.27 ఎకరాల భూమి కుంట పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో నమోదై ఉందని స్పష్టం చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న సర్పంచ్, మునిరాజ

రామచంద్రాపురం: విద్యార్థి దశ నుంచే పిల్లలు దాన, సేవా గుణాలు అలవరచుకోవాలని రాయలచెరువు వైఎస్సార్‌సీపీ సర్పంచ్ మాదాసు మురగయ్య అన్నారు. శుక్రవారం రాయలచెరువు ప్రభుత్వ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు గ్రామానికి చెందిన తణుకు మునిరాజు కుటుంబ సభ్యులు విద్యాసామగ్రిని సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. రెండేళ్లుగా ఈ వితరణ చేస్తుండటం అభినందనీయమని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మునికృష్ణారెడ్డి, టీచర్లు మైథిలి, కృష్ణమ్మ, లోకేశ్వరి, జనార్ధన్, మధు తదితరులు పాల్గొన్నారు.

అభినందన



విద్యార్థినిని అభినందిస్తున్న వీసీ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ యోగా విభాగ విద్యార్థిని సైరేంద్రి దేహిరి యోగాసన చాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం, రాష్ట్ర స్థాయిలో 4వ స్థానాన్ని కైవసం చేసుకుంది. వర్సిటీలో శుక్రవారం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెస్సీ యోగా థెరపి విద్యార్థి సైరేంద్రి దేహరి ఒడిశాలో జరిగిన యోగాసన చాంపియన్‌షిప్‌లో సత్తా చాటడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ రజనీ కాంత్ శుక్లా, యోగా విభాగాధిపతి డాక్టర్ తపస్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన

తిరుపతి కల్చరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి పర్యటనలో భాగంగా శ్రీకపిలేశ్వరాలయానికి శనివారం రానున్న నేపథ్యంలో ఆలయంలో ఏర్పాట్లను టీటీడీ ఈవో జే.శ్యామలరావు శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి పరిశీలించారు. అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సీవీ అండ్ ఎస్ఓ మురళీకృష్ణ, ఎస్ఈలు మనోహర్, వెంకటేశ్వర్లు, వీజీఓ సురేంద్ర, ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, ఆరోగ్యశాఖ డెప్యూటీ ఈఓ సోమన్ నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టింకరింగ్ ల్యాబ్‌లపై టీచర్లకు వర్క్‌షాప్



వర్క్‌షాపులో పాల్గొన్న జిల్లా అధికారులు, టీచర్లు

తిరుపతి సిటీ: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించేందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లపై టీచర్లకు విజయవాడ మేరీస్ స్టెల్లా కాలేజీలో ఈ నెల 15 నుంచి మూడు రోజు పాటు వర్క్‌షాపు నిర్వహించారు. తిరుపతి జిల్లా నుంచి ఆరుగురు టీచర్లు రిసోర్స్ పర్సన్లుగా ఎంపికయ్యారు. జిల్లా సైన్స్ అధికారి భాను ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి నోడల్ అధికారి మేఘనాథ్, టీచర్లు దేవదాస్, నారాయణరెడ్డి, సురేంద్రబాబు, నాగార్జున, సుబ్రమణ్య శర్మ ఈ శిక్షణకు హాజరయ్యారు.

తిరుమలలో భారీ వర్షం



తిరుమలలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. వర్షం ధాటికి భక్తులు తడిసి ముద్దయ్యారు. కొందరు భక్తులు శ్రీవారి ఆలయం ఎదుట ఉన్న జర్మన్ షెడ్ల కింద తలదాచుకున్నారు. ఆలయం నుంచి గదులకు వెళ్లేందుకు భక్తులు వర్షం మూలాన ఇబ్బందులు పడ్డారు. అలాగే, తిరుమలలో చలితీవ్రత పెరిగింది. - తిరుమల

భూ ఆక్రమణపై చర్యలు తీసుకుని న్యాయం చేయరూ!

తిరుపతి కల్చరల్: కొరమేనుగుంట లెక్క దాఖలాలోని సర్వే నంబర్‌లోని 98 అంకణాల భూ ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని శ్రీనివాసపురం, పోస్టల్ కాలనీకి చెందిన నరసింహారెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 2023లో ఆ భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని, అయితే ఈ స్థలం తమదంటూ సుబ్బమ్మ, భాగ్యమ్మ, మేఘనాథం, శ్రీనివాసులు దౌర్జన్యంగా ఆక్రమించి ఇంటి నిర్మాణానికి పూనుకున్నారని, రెండు నెలల క్రితం తనపై దౌర్జన్యం కూడా చేశారని అప్పట్లో పోలీసులకు సైతం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

మందుకొట్టి డ్రైవింగ్ చేస్తే ఇంతే..!

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 14 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచారు.